


ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం




# జనం ముచ్చట

గురువారం, సెప్టెంబర్ 10, 2026 తెలంగాణ పేజీలు : 4





వెయ్యి రోజుల దగా పాలనపై పోరాటం ఉధృతం చేస్తాం....

ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేకే బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్ : మాజీ ఎమ్మెల్యే సండ్ర



2 లో..

## పవిత్రమైన శాసనసభను...

# కౌరవ సభగా మార్చారు

## మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

**ఖమ్మం(జనం ముచ్చట)సెప్టెంబర్ 9:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పాలనపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను ఎండగడుతూ రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో చేపడుతున్న ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ప్రకటించారు.బుధవారం ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈ నెల 2వ తేదీ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను ప్రజల్లో ఎండగడుతూ వివిధ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

**ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన అసెంబ్లీలో సస్పెన్షన్లు...**

శాసనసభ సమావేశాల్లో రైతు రుణమాఫీ, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లు, సీతారామ ప్రాజెక్టు తదితర ప్రజా సమస్యలపై సమగ్ర చర్చ జరుగుతుందని రాష్ట్ర ప్రజలు ఆశించారని సండ్ర, కమల్ రాజు అన్నారు. అయితే ప్రభుత్వం ప్రజా సమస్యలపై సమాధానం చెప్పకుండా ప్రతిపక్ష సభ్యుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.ప్రజా సమస్యలను ఎదుర్కొనే ధైర్యం లేక కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభను 'కౌరవ సభ'గా మార్చిందని వారు విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి శాసనసభ వ్యవస్థపైనా, స్పీకర్ గడ్డం ప్రసాద్‌పైనా గౌరవం



2 లో..

**ఖమ్మం(జనం ముచ్చట) సెప్టెంబర్ 9:** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక విగ్రహాల నిమజ్జనం ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రెట్టింపు స్థాయిలో ముందస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. వినాయక చవితి నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు చేపట్టాల్సిన చర్యలు, నిమజ్జన పాయింట్లు, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ భద్రత, వైద్య, పారిశుధ్య ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు.



## గణేష్ నిమజ్జనానికి

# పకడ్బందీ ఏర్పాట్లు

## కలెక్టర్ దివాకర టీఎస్

**మున్నేరులో నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి....**

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తక్కువగా ఉందని కలెక్టర్ తెలిపారు. గతేడాది ఖమ్మం నగర పరిధిలోనే 1,000కు పైగా వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసిన నేపథ్యంలో ఈసారి నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.మున్నేరు బ్రిడ్జి వద్ద ప్రస్తుతం నిమజ్జనానికి అవసరమైన స్థాయిలో నీరు అందుబాటులో లేనందున పరిస్థితులకు అనుగుణంగా అనువైన నిమజ్జన ప్రాంతాలను గుర్తించాలని అన్నారు. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

## పవిత్రమైన శాసనసభను...

# కౌరవ సభగా మార్చారు

(మొదటి పేజీ తరువాయి)

ఉందని, ఇప్పటివరకు వారికి అండగా ఉంటూ వచ్చామని స్పష్టం చేశారు.

**ప్రతిపక్ష నిరసనలపై ద్వంద్వ వైఖరి ఎందుకని ప్రశ్న...**

శాసనసభ ప్రారంభ రోజున ప్రతిపక్ష పార్టీలు వివిధ రూపాల్లో తమ నిరసనను వ్యక్తం చేసే హక్కు కలిగి ఉంటాయని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అదానీ, అంబానీ అంశాలపై వివిధ రూపాల్లో నిరసన తెలిపిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. తెలంగాణలో బీఆర్ఎస్‌కు మాత్రం ఆ హక్కు లేదా? అని ప్రశ్నించారు.ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేసినప్పటికీ, కక్షపూరితంగా మొత్తం అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడం సరికాదన్నారు. నవీన్ కుమార్ రెడ్డిని సైతం సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు....

**కేసీఆర్ నివాసం ముట్టడి వెనుక ప్రభుత్వ ప్రోద్బలం ఉందా?**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసం ముట్టడికి పిలుపునివ్వడాన్ని బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా తప్పుబట్టారు. మాజీ ముఖ్యమంత్రి ఇంటిపైకి వందలాది మంది వెళ్లే పరిస్థితి ఏర్పడితే, హోంశాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

పోలీసులు చోద్యం చూస్తూ ఉండటం, ప్రభుత్వ విప్‌లు, ఆందోళనకారులకు ఎస్కార్ట్ కల్పించినట్లు కనిపించడం వెనుక ప్రభుత్వ ప్రోద్బలం ఉందా? అని వారు నిలదీశారు. ఇలాంటి రాజకీయ పరిణామాలు రాష్ట్రంలో ప్రజాస్వామ్య వాతావరణానికి మంచిది కాదన్నారు.

**కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరణాన్ని కోరుతూ ఒక కాంగ్రెస్



ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేయడం అత్యంత దారుణమని బీఆర్ఎస్ నేతలు అన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ప్రజాప్రతినిధి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సభ్యతా రహితమని పేర్కొన్నారు.అటువంటి వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, సదరు ఎమ్మెల్యే శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఎథిక్స్ కమిటీ వ్యవహరిస్తున్న తీరుపైనా సండ్ర వెంకట వీరయ్య, లింగాల కమల్ రాజు ప్రశ్నలు సంధించారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్ వంటి కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నేతలపై తీవ్ర వ్యాఖ్యలు చేసినప్పుడు ఎథిక్స్ కమిటీకి అవి ఎందుకు కనిపించవని ప్రశ్నించారు.ప్రతిపక్ష సభ్యుల వ్యాఖ్యలే కనిపిస్తాయా? అధికార పార్టీ నేతల వ్యాఖ్యలు వినిపించవా? అంటూ నిలదీశారు. ఎథిక్స్ కమిటీ నిష్పాక్షికంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

**మహిళా ప్రజాప్రతినిధుల పట్ల వ్యవహరించిన తీరు సరికాదు**

మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా తప్పుబట్టారు. మహిళా ప్రజాప్రతినిధుల వద్ద మగ పోలీసులను, మగ ప్రజాప్రతినిధుల వద్ద మహిళా పోలీసులను ఉంచడం ద్వారా వారిని అవమానించారని ఆరోపించారు.మహిళా ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుండా, మహిళా కానిస్టేబుల్ ద్వారా అక్రమ కేసులు పెట్టించారని వారు ఆరోపించారు. ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకునే అధికారం ఎవరు ఇచ్చారంటూ హైకోర్టు ప్రశ్నించడం ప్రభుత్వానికి చెంపపెట్టు వంటిదని వ్యాఖ్యానించారు. అదే విధంగా సీతారామ ప్రాజెక్టు విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేశారు. తమ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రాజెక్టును దాదాపు 90 శాతం పూర్తి చేశారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.80 కోట్ల మేర ఖర్చు చేసి దాని ఘనతను తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వ కృషిని విస్మరించి అభివృద్ధిని హైజాక్ చేయాలని చూస్తున్నారని విమర్శించారు.

**విద్యార్థులు, రైతుల సమస్యలపై సమాధానం చెప్పాలి**

ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, రైతాంగం కూడా అనేక సమస్యలను ఎదుర్కొంటోందని బీఆర్ఎస్ నేతలు తెలిపారు. ఈ సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు.

ప్రజా సమస్యలను శాసనసభలో ప్రస్తావించే ప్రతిపక్ష సభ్యుల హక్కును సస్పెన్షన్లతో కాలరాయలేరని స్పష్టం చేశారు. ప్రజల తరఫున బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, రేపటి నుంచి ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ 'దగా పాలన'ను మరింత ఉధృతంగా ఎండగడతామని సండ్ర వెంకట వీరయ్య, లింగాల కమల్ రాజు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, బిచ్చాల తిరుమలరావు, బొమ్మెర రామ్మూర్తి, హెచ్. ప్రసాద్, ఆరెంపల వీరభద్రం, బలుసు మురళీకృష్ణ, కోడిరెక్కల ఉమాశంకర్, నారమళ్ల వెంకన్న, పిడదల రామ్మూర్తి, కోడిరెక్కల ఫ్రాన్సిస్, సద్దాం, మొహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.....

# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

, ఉత్సవ కమిటీలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు..ప్రస్తుత పరిస్థితులు, నిమజ్జన ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీలు, అధికారుల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, సమాచారం ముందుగానే ప్రజలకు చేరేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రూట్‌మ్యాప్....

**ట్రాఫిక్ డైవర్షన్ ముందుగానే ప్రకటించాలి....**

వినాయక విగ్రహాల నిమజ్జనానికి సంబంధించిన రూట్‌మ్యాప్‌ను ముందుగానే సిద్ధం చేసి ఉత్సవ కమిటీలు, ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సెప్టెంబర్ 20వ తేదీ సాయంత్రానికల్లా ట్రాఫిక్ డైవర్షన్ అడ్వైజరీని విడుదల చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు..పోలీస్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నిమజ్జన పాయింట్లను ఖరారు చేయాలని, నిమజ్జనం సందర్భంగా ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన సంఖ్యలో ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేయాలని అన్నారు.నిమజ్జన రూట్‌లో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, ఇంటర్నెట్, టీవీ కేబుల్స్ తదితరాలు విగ్రహాల తరలింపునకు అడ్డంకిగా మారకుండా అవసరమైన చోట్ల సర్దుబాటు చేయాలని ఆదేశించారు. రహదారి మరమ్మతులు అవసరమైన చోట వెంటనే పనులు చేపట్టి పూర్తి చేయాలని, నిమజ్జన పాయింట్లకు అప్రోచ్ రోడ్లు సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు....

**విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు....**

గణేష్ మండపాలకు విద్యుత్ సరఫరా విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ అన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి మండపానికి లైన్‌మ్యాన్ ద్వారా విద్యుత్ కనెక్షన్ అందించేలా చర్యలు



తీసుకోవాలని సూచించారు.ప్రజలు స్వయంగా అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకొని ప్రమాదాలకు గురికావద్దని హెచ్చరించారు. విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ తీగల కారణంగా విద్యుత్ షాక్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, గణేష్ మండపాల్లో షార్ట్‌సర్క్యూట్‌కు అవకాశం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు...

**నిమజ్జన పాయింట్ల వద్ద మౌలిక వసతులు....**

ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద బ్యారికేడ్లు, క్రేన్లు, విద్యుత్ సరఫరా, తాగునీరు, లైటింగ్ తదితర సౌకర్యాలను సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారు. విగ్రహాల తరలింపునకు అడ్డుగా ఉండే చెట్ల కొమ్మలను ముందుగానే తొలగించాలని సూచించారు.

ఎత్తైన వినాయక విగ్రహాల తరలింపును ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన సంఖ్యలో గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా నియమించాలని అన్నారు. స్విమ్మర్లతో ముందుగానే సమన్వయం చేసుకొని షిఫ్టుల వివరాలను తెలియజేయాలని సూచించారు....

**వైద్య, పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి....**

ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, 108 వాహనాన్ని అందుబాటులో ఉంచడంతో పాటు అత్యవసర మందులు, వైద్య సామగ్రిని సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో షిఫ్టుల వారీగా పారిశుధ్య సిబ్బందిని నియమించి నిరంతరం పరిశుభ్రతను పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

ప్రతి గణేష్ మండపంలో చేపట్టిన ఏర్పాట్లు, భద్రతా చర్యల వివరాలను ముందుగానే తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మండపం వద్ద పోలీస్, ఫైర్, విద్యుత్, వైద్య తదితర అత్యవసర సేవల అధికారుల సంప్రదింపు వివరాలతో కూడిన పోస్టర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు....

**నిమజ్జనం సందర్భంగా మద్యం విక్రయాలపై కఠిన చర్యలు....**

వినాయక నిమజ్జనం సందర్భంగా జిల్లాలో ఎక్కడా మద్యం విక్రయాలకు అనుమతి ఇవ్వకూడదని, మద్య నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని ఆయన కోరారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఏటా జరిగే కార్యక్రమమేననే కారణంతో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మరింత అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి అనూజ్ అగర్వాల్, విద్యుత్ ఎస్ఈ శ్రీనివాస చారి, ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు వినోద్ లహోటి, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ కె. జయపాల్ రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లిక అంజయ్య, ట్రెజరర్ ఎం. శ్రీహరి, సెక్రటరీ దోవలె సాయికిరణ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు..

# కేసీఆర్ పై ఎమ్మెల్యే శంకర్ వ్యాఖ్యలపై ఖమ్మం
# బీఆర్ఎస్ నేతల ఆగ్రహం




**ఖమ్మం (జనం ముచ్చట)సెప్టెంబర్ 9:** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకరయ్య చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ మరణాన్ని కోరే విధంగా, ఆయనకు హాని కలిగించేలా ప్రేరేపించే ధోరణిలో ఎమ్మెల్యే వ్యాఖ్యలు ఉన్నాయని వారు ఆరోపించారు. ఒక ప్రజాప్రతినిధి స్థాయిలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. సెప్టెంబర్ 8న ఎమ్మెల్యే శంకరయ్య చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలు సోషల్ మీడియా, ఆర్టీవీ ప్రసారం ద్వారా విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు లేదా హింసకు దారితీసేలా ఉండే వ్యాఖ్యలు మాత్రం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని పేర్కొన్నారు.....

**బిర్ల శంకర్ వ్యాఖ్యలపై సమగ్ర దర్యాప్తు చేయాలి....**

కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై ప్రభుత్వం మౌనం వహించకుండా తక్షణమే స్పందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు చేసే వ్యాఖ్యలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తాయని, వాటి ప్రభావం పార్టీ కార్యకర్తలు, అభిమానులు, సామాన్య ప్రజలపై పడే అవకాశం ఉందని అన్నారు. ఎమ్మెల్యే శంకరయ్య వ్యాఖ్యలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, వాటిలో చట్టవిరుద్ధత ఉన్నట్లు తేలితే భారతీయ న్యాయ సంహిత (దీచీూ)లోని వర్తించే నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యాఖ్యల వెనుక ఉద్దేశం ఏమిటి, వాటి వల్ల ఎలాంటి పరిణామాలకు అవకాశం ఉందనే అంశాలను కూడా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఈ వ్యవహారంలో ఎవరైనా ప్రోత్సహించినా, సహకరించినా వారి పాత్రను కూడా విచారించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు....

**కేసీఆర్ భద్రతపై ఆందోళన....**

ఈ వ్యాఖ్యల నేపథ్యంలో కేసీఆర్ భద్రతను ప్రభుత్వం తక్షణమే సమీక్షించాలని బీఆర్ఎస్ ఖమ్మం నాయకులు డిమాండ్ చేశారు. ఆయనకు ఎలాంటి హాని జరగకుండా అవసరమైన భద్రతా చర్యలను చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలకు ప్రజాస్వామ్యంలో పరిమితులు ఉన్నాయని, ఆ పరిమితులు దాటి వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని లేదా హింసకు ప్రేరేపించే విధంగా వ్యాఖ్యలు చేస్తే ప్రభుత్వం చట్టప్రకారం స్పందించాల్సిన బాధ్యత ఉందని వారు స్పష్టం చేశారు. ఈ అంశంపై బీఆర్ఎస్ ఖమ్మం నాయకులు సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేసి, ఎమ్మెల్యే శంకరయ్య వ్యాఖ్యలపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కేసీఆర్ భద్రతను సమీక్షించి,అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు....

ఈ కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయకుమార్, మాజీ కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, దండ జ్యోతి రెడ్డి, అయ్యప్ప రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బీరెడ్డి నాగచంద్రరెడ్డి, దేవభక్తుని కిషోర్ బాబు, కొనకంచి ప్రసాద్, కోలేటి రాధాకృష్ణ, జాబిశెట్టి శ్రీనివాసరావు, చిలకల వెంకట నరసయ్య, పొదిలి నాగరాజు, యాకూబ్ పాషా, మారగాని సుదర్శన్, వంగవీటి శ్రీనివాసరావు, చల్లగుండ్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. రాజకీయ విమర్శలు విధానాలు, ప్రజా సమస్యల చుట్టూ ఉండాలని, వ్యక్తిగత దూషణలు లేదా హింసకు దారితీసే వ్యాఖ్యలకు తావివ్వకూడదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.




## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై కేసు నమోదు చేయాలనీ మధిర బీఆర్ఎస్ డిమాండ్

**మధిర, సెప్టెంబర్ 9: (జనం ముచ్చట)**

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావు మరణాన్ని కోరుతూ, ఆయనకు హాని కలిగించేలా ప్రేరేపించే విధంగా వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ పార్టీ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. బుధవారం మధిరకు చెందిన బీఆర్ఎస్ నాయకులు మధిర టౌన్ సీఐ రమేష్‌ను కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదును అందజేశారు. కేసీఆర్‌పై బహిరంగంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఆయన మరణాన్ని కోరుతూ మాట్లాడటం తీవ్ర అభ్యంతరకరమని నాయకులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కీలకంగా పోరాడిన కేసీఆర్‌పై ఒక ప్రజాప్రతినిధి ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, వ్యక్తిగతంగా ఒక నాయకుడి ప్రాణాలకు హాని కలిగించేలా లేదా మరణాన్ని కోరుకునేలా వ్యాఖ్యలు చేయడం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శంకర్ చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలు ప్రజల్లో ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉందని, ఇలాంటి వ్యాఖ్యలను పోలీసులు తీవ్రంగా పరిగణించాలని వారు కోరారు. వ్యాఖ్యలపై సమగ్రంగా విచారణ జరిపి, వర్తించే చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్‌కు భద్రతను కూడా తక్షణమే సమీక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పల్లపోతు వెంకటేశ్వరావు, చిత్తారి నాగేశ్వరావు, అరిగే శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, చావా వేణు, వంకాయలపాటి నాగేశ్వరరావు, ఆళ్ల నాగబాబు, ప్యారి, చీధిరాల రాంబాబు, వేల్పుల శివ, వీర రాఘవరెడ్డి, బొగ్గుల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు అందిన ఫిర్యాదుపై విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కాగా, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలు, వ్యాఖ్యలపై ఆయన లేదా కాంగ్రెస్ పార్టీ తరఫున అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.

---

## కేసీఆర్‌పై 'మరణ' వ్యాఖ్యలు.. షాద్‌నగర్ ఎమ్మెల్యేపై
# బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

**ఖమ్మం (జనం ముచ్చట)సెప్టెంబర్ 10:** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకరయ్య చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై ఖమ్మం బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ మరణాన్ని కోరేలా, ఆయనకు హాని కలిగించే విధంగా ప్రేరేపించే ధోరణిలో వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపిస్తూ ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ షేక్ మక్బూల్, మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్, మాజీ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎం.డి. ఖమర్ తదితరులు బుధవారం ఖమ్మం వన్‌టౌన్ సీఐను కలిసి ఫిర్యాదు అందజేశారు....

సెప్టెంబర్ 8న షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలు సోషల్ మీడియా, న్యూస్ ఛానళ్ల ద్వారా విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయని బీఆర్ఎస్ నేతలు తెలిపారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు లేదా హింసకు దారితీసేలా వ్యాఖ్యలు చేయడం మాత్రం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని వారు పేర్కొన్నారు.



ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రజల్లో ఉద్రిక్తతలకు, రాజకీయ కార్యకర్తల మధ్య ఘర్షణలకు దారితీసే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఒక ప్రజాప్రతినిధి చేసే వ్యాఖ్యలు సమాజంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ఈ అంశంపై మౌనం వహించకూడదని డిమాండ్ చేశారు....

ఎమ్మెల్యే శంకరయ్య చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని బీఆర్ఎస్ నేతలు పోలీసులను కోరారు. వ్యాఖ్యల అసలు ఉద్దేశం ఏమిటి, వాటి వల్ల ఎలాంటి పరిణామాలు తలెత్తే అవకాశం ఉంది అనే అంశాలను విచారించాలని కోరారు. భారతీయ న్యాయ సంహిత (దీచీూ)లో వర్తించే నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యల వెనుక ఎవరైనా ప్రోత్సహించినా, సహకరించినా వారి పాత్రను కూడా దర్యాప్తులో భాగంగా పరిశీలించాలని కోరారు, అంతే కాకుండా ఎమ్మెల్యే వ్యాఖ్యల నేపథ్యంలో కేసీఆర్ భద్రతను ప్రభుత్వం తక్షణమే సమీక్షించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు,ఆయనకు ఎలాంటి హాని జరగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు....

రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలకు ఒక పరిమితి ఉండాలని, ఆ పరిమితిని దాటి హింసను ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేస్తే ప్రభుత్వం, పోలీసులు చట్టప్రకారం కఠినంగా వ్యవహరించాలని వారు స్పష్టం చేశారు.

ఈ మేరకు ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐకు ఫిర్యాదు చేసి, ఎమ్మెల్యేపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు...ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పల్లా రోజున రోజ్లిన్, బీఆర్ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శి షేక్ షకీనా, నాయకులు బండారు శ్రీను, ఇలియాస్ పాషా, ముజాహిద్, గౌతమ్ బాబు, మున్నా లింగారెడ్డి, ఈజహర్, సాజిద్, ఆజం పాషా, షరీఫ్, ఉస్మాన్, గౌరీనాథ్, ఫెరోజ్, శైలజ, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే డైవర్షన్ పాలిటిక్స్ : పువ్వాడ అజయ్ కుమార్

**ఖమ్మం(జనం ముచ్చట)సెప్టెంబర్10:**

కాంగ్రెస్ ప్రభుత్వం విద్వేషం, విధ్వంస విధానాలతో పాలన సాగిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు పువ్వాడ అజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజుల పాలన పూర్తయిన నేపథ్యంలో ప్రజల్లో ప్రభుత్వ పనితీరుపై చర్చ జరుగుతోందని, అయితే ఆ చర్చను పక్కదారి పట్టించేందుకు కాంగ్రెస్ నాయకులు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వం కొత్త రాజకీయ అంశాలను తెరపైకి తెస్తూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.



ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పాలనలో చోటుచేసుకున్న వైఫల్యాలపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. అసలు సమస్యలపై చర్చ జరగకుండా ఇతర రాజకీయ అంశాలను ముందుకు తెచ్చి ప్రజల దృష్టిని మరల్చడం సరైన విధానం కాదని అన్నారు.ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం రాజకీయ విమర్శలు, ఆరోపణలు, వివాదాస్పద అంశాల చుట్టూ రాజకీయాలను నడుపుతోందని ఆయన విమర్శించారు. ఎన్ని డైవర్షన్ పాలిటిక్స్ చేసినా ప్రజలను తప్పుదోవ పట్టించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.....

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు ప్రభుత్వ పనితీరును నిశితంగా గమనిస్తున్నారని పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు ఎంతవరకు జరిగింది, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రజలకు కలిగిన ప్రయోజనం ఏమిటనే అంశాలపై ప్రజల్లో చర్చ కొనసాగుతూనే ఉంటుందని పేర్కొన్నారు.ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు రాజకీయంగా ఎన్ని అంశాలను తెరపైకి తీసుకొచ్చినా ప్రజల సమస్యలు పక్కకు పోవని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడమే ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా ఉండాలని సూచించారు.

ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ నిరంతరం ప్రజల తరపున పోరాడుతుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు బదులుగా పాలన, అభివృద్ధి, సంక్షేమం, హామీల అమలుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని రకాల రాజకీయ వ్యూహాలకు పాల్పడినా ప్రజలు వాస్తవాలను గుర్తిస్తారని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లే విషయంలో బీఆర్ఎస్ వెనక్కి తగ్గదని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు..

# పర్యాటక ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి



**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.**
**మూడు సంవత్సరాల జిల్లా పర్యాటక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి.**
**పీఎం సేతు, ప్రగతి పోర్టల్‌పై సమగ్ర వివరాలు విశ్లేషించాలి.**
**పర్యాటక అభివృద్ధి, జ్ఞాన భారతం మిషన్‌పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్.**

**ఖమ్మం(జనం ముచ్చట)సెప్టెంబర్10:**

జిల్లాలో గుర్తించిన పర్యాటక ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.

బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించగా, కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి శ్రీజ, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్ లతో కలిసి పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి 142 పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ప్రణాళిక, ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడం, ప్రభుత్వ భూములతో ల్యాండ్ బ్యాంక్ గుర్తింపు, పీపీపీ విధానంలో పర్యాటక ప్రాజెక్టులు, మూడు సంవత్సరాల జిల్లా పర్యాటక కార్యాచరణ ప్రణాళిక, జ్ఞాన భారతం మిషన్, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.

వీడియో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు అవసరమైన మౌళిక వసతులు కల్పించడంతో పాటు, పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో గుర్తించిన వీకెండ్ గేట్‌వే పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు, మౌళిక వసతులు, రహదారులు, త్రాగునీరు, మరుగుదొడ్లు, భద్రత, సమాచార కేంద్రాలు, తదితర సౌకర్యాలను కల్పించేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాకు ప్రత్యేకమైన పర్యాటక సామర్థ్యాన్ని గుర్తించి మూడు సంవత్సరాల జిల్లా పర్యాటక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాధాన్యత కలిగిన పర్యాటక ప్రాంతాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, అవసరమైన మౌళిక వసతులు, పెట్టుబడి అవకాశాలు, పర్యాటక ప్రచారం తదితర అంశాలను స్పష్టమైన కాల పరిమితులతో పొందుపరచాలని తెలిపారు.

జ్ఞాన భారతం మిషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అందుబాటులో ఉన్న ప్రాచీన గ్రంథాలు, మాన్యుస్క్రిప్టులను గుర్తించాలని ఆదేశించారు. పర్యాటక అభివృద్ధితో పాటు నైపుణ్యాభివృద్ధిపై కూడా దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, ఇతర స్కిల్లింగ్ సంస్థల ఇన్‌చార్జ్‌లు, డీఆర్‌డీఏ అధికారులు కలిసి పీఎం సేతు, ప్రగతి పోర్టల్‌కు సంబంధించిన వివరాలను సమగ్రంగా విశ్లేషించాలని ఆదేశించారు. ఆయా పోర్టళ్లలో అందుబాటులో ఉన్న అవకాశాలు, నైపుణ్య శిక్షణకు సంబంధించిన కార్యక్రమాలు, జిల్లాకు ఉపయోగపడే అంశాలను గుర్తించి నివేదిక అందించాలని సూచించారు.

పర్యాటక ప్రాంతాల్లో స్థానిక యువతకు గైడ్‌లు, హాస్పిటాలిటీ, ఫుడ్ సర్వీసెస్, టూరిజం సంబంధిత ఇతర నైపుణ్యాల్లో శిక్షణ అందించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. యువతను పర్యాటక రంగంతో అనుసంధానం చేసేందుకు యూత్ టూరిజం క్లబ్‌లను ప్రోత్సహించాలని సూచించారు.

జిల్లాకు ప్రత్యేకమైన పర్యాటక గుర్తింపు, బ్రాండింగ్‌ను అభివృద్ధి చేసి, విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం శాఖల మధ్య సమన్వయం పెంచాలని, ప్రతి అంశంపై స్పష్టమైన బాధ్యతలు అప్పగించి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.

ఈ వీడియో సమీక్షలో జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.